"కేసీఆర్ ప్రభుత్వం తొమ్మిదిన్నరేండ్లలో కులం పేరుతో కుంపట్లు పెట్ట లేదు.. మతం పేరుతో మంటలు పెట్టలేదు.. ప్రాంతం పేరుతో పంచా యతీ పెట్టలేదు.. హైదరాబాద్ నగరం చాలా ప్రశాంతంగా ఉన్నది.. అభివృద్ధికి ఓటు వేస్తే విశ్వనగర సాధనకు తామేమి చేస్తామనేది కేటీ ఆర్ ప్రతి చోట రోడ్ షోలలో సోదహరణంగా వివరిస్తూ సాగారు."

"అభివృద్ధి కావాలా? అరాచకం కావాలా? కరెంట్ కావాలా? కాంగ్రెస్ కావాలా? పొరపాటుగా తప్పచేస్తే హైదరాబాద్ అభి వృద్ధి ఆగమైతది.. మళ్లీ ఆ చీకటి రోజులు వస్తాయి.. కరోనా వచ్చినా, వరదలు వచ్చినా ప్రజల వెంట ఉన్నది బీఆర్ఎస్ పార్టీయే. హైదరాబాద్‌లో ఉన్నోళ్లంతా మా వారే, మా బిడ్డలే."

" బీఆర్ఎస్ పాలనలో కరెంట్ కష్టాలు లేవు.. కంపెనీలు వస్తు న్నాయి.., సంపద పెరుగుతున్నది.. ఉపాధి దొరుకుతున్నది.. దేశంలోని లక్షల మందికి అమ్మలా అన్నంపెడుతున్న హైదరాబాద్‌ను కాపాడుకోవాల్సిన అవసరం మన అందరిపై ఉన్నది."

# గులాబీ దళానికి.. ఒకేఒక్కడు

# అడుగడుగునా నీరాజనం



## గ్రేటర్‌లో అన్నీ తానై నడిపించిన కేటీఆర్

- ప్రధాని, సీఎంలు, కేంద్రమంత్రులు, రాహుల్‌గాంధీ ఒకవైపు
- మంత్రి కేటీఆర్ ఒక్కడే మరోవైపు
- 10 రోజుల్లో 17 నియోజకవర్గాలను చుట్టేసిన యువనేత
- దాదాపు 40కిపైగా కార్నర్ మీటింగ్‌లు
- అనర్గళమైన స్పీచ్‌తో ప్రజలను ఆకట్టుకున్న మంత్రి
- వెల్లువలా తరలివచ్చిన జనం.. అడుగడుగునా బ్రహ్మరథం
- విజయ యాత్రలను తలపించిన రోడ్ షోలు
- జన స్పందన పట్ల శ్రేణుల్లో రెట్టింపు ఉత్సాహం



సిటీబ్యూరో, నవంబర్ 28 (నమస్తే తెలంగాణ ) : గ్రేటర్ ఎన్నికల సంగ్రామంలో భాగంగా బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీ రామారావు చేపట్టిన రోడ్ షోలు సూపర్ హిట్ అయ్యాయి. 10 రోజుల పాటు 17 నియోజకవర్గాలను చుట్టేసి దాదాపు 40కి పైగా కార్నర్ మీటింగ్‌లలో పాల్గొన్నారు. రోజుకు రెండు, మూడు నియోజకవర్గాల చొప్పున రోడ్ షోలు నిర్వహించి పార్టీ అభ్యర్థుల తరపున ప్రచారం నిర్వహించారు. ఒక్కో నియోజకవర్గంలో నాలుగు నుంచి ఆరు చోట్ల వేదికల ద్వారా మంత్రి కేటీఆర్ ప్రసంగించారు. నియోజకవర్గం ప్రాముఖ్యత, డివిజన్‌లలో ప్రభుత్వ చేపట్టిన అభివృద్ధిని, సంక్షేమ కార్యక్రమాలను సభలకు హాజరైన ప్రజలకు పూసగుచ్చినట్టు వివరిస్తూ ఆకట్టుకున్నారు. మంత్రి తనదైన శైలిలో సంక్షేమం, అభివృద్ధి పథకాలను వివరిస్తున్నంతసేపు జనం నుంచి విశేష స్పందన లభించింది. మంత్రి కేటీఆర్ తనదైన మార్కు ప్రచారానికి శ్రేణుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. ప్రతి రోడ్ షోలో అడుగడుగునా జనప్రభంజనం కనిపించింది.

### రోడ్ షోలే.. విజయ యాత్రలా?

కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, జూబ్లీహిల్స్, ఖైరతాబాద్, ముషీరాబాద్, అంబర్‌పేట, నాంపల్లి, ఉప్పల్, గోషామహల్, సికింద్రాబాద్, మల్కాజిగిరి, మలక్‌పేట నియోజకవర్గాల పరిధిలో మంత్రి కేటీఆర్ తనదైన మార్కు ప్రచారం నిర్వహించారు. కేటీఆర్ నిర్వహించిన రోడ్ షోలు.. బహిరంగ సభలా? విజయ యాత్రలా..? అనే రీతిలో జరిగాయి. అన్ని చోట్ల భారీగా తరలివచ్చి తారక రాముడికి జన హారతి పట్టారు. ముఖ్యంగా మహిళలు బోనాలతో స్వాగతం పలికారు. డప్పు, చప్పుళ్లు, కళాకారుల నృత్యాలు, బోనాలతో గల్లీలు, కాలనీల్లో హోరెత్తించారు. ఎక్కువగా రోడ్ షోలకు యువత భారీగా తరలివచ్చారు. దీంతో రోడ్ షో ప్రాంతాలలో ఎటు చూసినా ప్రభంజనమే కనిపించింది. ఆ ప్రాంతం, ఈ ప్రాంతం అనే తేడా లేకుండా జనం వెల్లువలా తరలివచ్చి బ్రహ్మరథం పట్టారు. బీజేపీ తరపున ప్రధాని మోదీ నుంచి అమిత్‌షా, యూపీ సీఎం యోగి, కేంద్ర మంత్రులు, కాంగ్రెస్ నుంచి రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గే, కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ ప్రచారం చేపట్టగా.. బీఆర్ఎస్ తరపున మంత్రి కేటీఆర్ ఒక్కడే అన్నీ తానై సమర్థవంతంగా ప్రచారంలో రాణించారు.

### సూపర్‌హిట్ రోడ్‌షోలతో శ్రేణుల్లో జోష్

రోడ్ షోలకు వచ్చిన జన స్పందన చూసి గులాబీ శ్రేణుల్లో ఉత్సాహం రెట్టింపు అయ్యింది. పోలింగ్ ముగిసే వరకు మరింత కష్టపడి పనిచేయాలనే పట్టుదల వారిలో కనబడుతున్నది. కాలనీలు, బస్తీల్లో కాంగ్రెస్, బీజేపీల వంచనను వివరించాలన్న ఉత్సాహం వారిలో నెలకొన్నది. రోడ్ షోలు సూపర్‌హిట్ అయ్యాయని, తమకు, తమ యువనేత కొత్త జవసత్వాలు అందించారని, ఈ స్ఫూర్తితో ఎన్నికలు అయిపోయేంతవరకు అవిశ్రాంతంగా పనిచేస్తామని కార్యకర్తలు, నాయకులు రెట్టించిన ఉత్సాహంతో ప్రకటిస్తుండడం విశేషం.

### తొమ్మిదిన్నరేండ్ల ప్రగతి మీ కళ్లముందే ఉన్నది

తొమ్మిదిన్నరేండ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం సాధించిన ప్రగతి మీ కళ్లముందే ఉన్నది. నికరంగా బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన పనితీరుకు.. 65 ఏండ్ల కాంగ్రెస్ పాలనను ప్రజలు గుర్తించాలని, కులం, మతం, ప్రాంతం అనే తేడా లేకుండా పాలన అందించామని మంత్రి కేటీఆర్ వివరించారు. కాంగ్రెస్ హయాంలో కరెంటు కోతలతో పవర్ హాలిడేలు, ఇన్వర్టర్లు, జనరేటర్ల కష్టాలను వివరించారు. మరీ ముఖ్యంగా కాంగ్రెస్ అంటేనే హైదరాబాద్ కర్ఫ్యూ నీడలో గడుపుతుందనే చరిత్రను ప్రజల ముందు ఉంచారు. స్వార్థ రాజకీయాలతో పాటు శాంతిభద్రతల నిర్వహణలో ఆ పార్టీ విఫలమైనప్పుడు తలెత్తిన కల్లోలాలను వివరించారు. బీఆర్ఎస్ పాలనలో ముందెన్నడూ లేనివిధంగా అభివృద్ధిలో దూసుకువెళ్తున్నదని, హైదరాబాద్ విశ్వనగరంగా రూపుదిద్దుకున్నదని చెప్పారు. గత ప్రభుత్వాల హయాంలో సంవత్సరానికి నాలుగు సార్లు కర్ఫ్యూ ఉంటే బీఆర్ఎస్ ప్రభుత్వంలో కనీసం నాలుగు సెకన్లు కూడా కర్ఫ్యూ పెట్టలేదని తెలిపారు. శాంతిభద్రతలు, నగర జీవన ప్రమాణాలు పెంచామని, ఇక్కడ ఉంటున్న వారందరినీ కంటికి రెప్పలా కాపాడుకున్నామంటూ మంత్రి కేటీఆర్ ప్రసంగిస్తూ అందరినీ ఆకట్టుకున్నారు. తొమ్మిదిన్నరేండ్లలో హైదరాబాద్ నగరం ప్రశాంతంగా ఉన్నదని, ఈ ప్రశాంతతను కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరి మీద ఉన్నదన్నారు.

### కేటీఆర్ రోడ్ షో వివరాలు

| తేదీ | కార్నర్ మీటింగ్‌లు |
|---|---|
| 16వ తేదీన | కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ |
| 17వ తేదీన | జూబ్లీహిల్స్ , ఖైరతాబాద్ |
| 18వ తేదీన | నాంపల్లి, గోషామహల్ |
| 20వ తేదీన | ఉప్పల్, ఎల్బీనగర్ |
| 21వ తేదీన | సికింద్రాబాద్ కంటోన్మెంట్, సనత్‌నగర్ |
| 22వ తేదీన | శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్ |
| 23వ తేదీన | ఉప్పల్, మల్కాజిగిరి |
| 25వ తేదీన | మలక్‌పేట, గోషామహల్ |
| 26వ తేదీన | అంబర్‌పేట, ముషీరాబాద్ |

### హైదరాబాద్ ప్రగతి కొనసాగాలి

వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే. వచ్చే టర్మ్‌లో హైదరాబాద్‌లో 24 గంటల తాగునీరు, డ్రైనేజీ, చెరువులను బాగుపర్చుకుందామని కేటీఆర్ అన్నారు. రానున్న రోజుల్లో ప్రతి ఒక్క మహిళకు సౌభాగ్య లక్ష్మి పేరిట ప్రతి నెల రూ.3వేలు, ఆసరా పెన్షన్లు పెరుగుతాయని, తెల్ల రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి అన్నపూర్ణ పథకం ద్వారా సన్నబియ్యం పంపిణీ చేస్తామని కేటీఆర్ చెప్పా. తెల్ల రేషన్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి కేసీఆర్ బీమా.. ఇంటింటికీ ధీమా కార్యక్రమం ద్వారా రూ.5లక్షల జీవితబీమా సౌకర్యం కల్పిస్తామన్నారు. మోడీ పాలనలో రూ.400 సిలిండర్ రూ.1200కు చేరిందని.. డిసెంబర్ 3 తర్వాత పెంచిన రూ.800లను కేసీఆర్ ప్రభుత్వమే భరించి ఆడబిడ్డలకు రూ.400లకే సిలిండర్లు అందజేస్తామన్నారు. ప్రజలు సైతం వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని ప్రజలు గులాబీ పార్టీ అభ్యర్థులను ఆశీర్వదిస్తున్నారు.

---

# 'ఆర్ట్ ఆఫ్ డెమోక్రసీ' డాక్యుమెంటరీని ఆవిష్కరించిన ఆర్జీవీ

ఖైరతాబాద్, నవంబర్ 28 : ఓటును అమ్ముడమంటే మన భవిష్యత్‌ను అమ్మడమేనని సినీ దర్శకుడు రాంగోపాల్ వర్మ అన్నారు. మంగళవారం ప్రముఖ కార్టూనిస్టుల చిత్రాలు, సందేశాలతో కూడిన డాక్యుమెంటరీని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ ఆర్టిస్ట్ ఫోరం, హైదరాబాద్ ప్రెస్‌క్లబ్, ఫోరం ఫర్ పొలిటిక్ కార్టూనిస్ట్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాంగోపాల్ వర్మ ఆవిష్కరించారు. ఆర్టిస్టు, తెలంగాణ అమరుల జ్యోతి రూపకర్త ఎంవీ రమణా రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో కార్టూనిస్టులు వేసిన చిత్రాలను ఆర్జీవీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఫోరం ఫర్ పొలిటిక్ కార్టూనిస్ట్స్ కార్యదర్శి, నమస్తే తెలంగాణ కార్టూనిస్టు మృత్యుంజయ కార్టూన్ల సంకలనాలైన ఉద్యమగీత, ఎకోస్ లైన్స్, హరిహాసం పుస్తకాలను ఆర్జీవీకి అందజేశారు. ఈ సందర్భంగా ఆర్జీవీ మాట్లాడుతూ స్పీచ్ ద్వారా భావాలను చెప్పగలుగుతామని, కార్టూనిస్టులు మాత్రం ఒక్క చిత్రంలో ఎన్నో భావాలు పలికిస్తారన్నారు. ప్రజలకు ఎవరో అందుబాటులో ఉంటారో వారికే ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్టూనిస్టులు శంకర్ ( సాక్షి), నర్సిమ్ (నవ తెలంగాణ), రాకేశ్, చారి (ఆంధ్రజ్యోతి), జె. వెంకటేశ్ (వెలుగు), నివాస్ చొల్లేటి (ప్రజాపక్షం) సురేందర్ సముద్రాలతో పాటు ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్. వేణుగోపాల నాయుడు, రవికాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



'ఆర్ట్ ఆఫ్ డెమోక్రసీ' డాక్యుమెంటరీని ఆవిష్కరిస్తున్న ఆర్జీవీ

---

# ఆశీర్వదించండి.. సాయన్న పేరు నిలబెడుతా

## కంటోన్మెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి లాస్యనందిత

కంటోన్మెంట్, నవంబర్ 28 : రాష్ట్రంలో ఇంటిపార్టీగా ఉన్న బీఆర్ఎస్‌కు అందరూ అండగా నిలవాలని కంటోన్మెంట్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి లాస్యనందిత స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజలే తమ బాసులని తేల్చిచెప్పారు. కంటోన్మెంట్ నియోజకవర్గంలో అన్నివర్గాల ప్రజలున్నారని.. అందరికీ న్యాయం చేసేది ఒక్క గులాబీజెండా మాత్రమేనన్నారు. కేసీఆర్ పాలనలో జరిగిన సంక్షేమం దేశంలో ఎక్కడా జరగలేదని గుర్తుంచుకోవాలన్నారు. దివంగత ఎమ్మెల్యే సాయన్న చొరవతో కంటోన్మెంట్ నియోజకవర్గంలో అనేక అభివృద్ధి పనులు జరిగాయన్నారు. సాయన్న చేసిన అభివృద్ధిని చూసి, తనకు ఓటు వేయాలని కోరారు. ప్రజలందరి దీవెనలతో గెలిచేది తానేనని.. గెలిచిన తర్వాత సాయన్న బిడ్డగా ఆయన పేరును నిలబెడుతానని మాట ఇచ్చారు.



నందమూరినగర్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో వృద్ధురాలిని అలింగనం చేసుకున్న బీఆర్ఎస్ అభ్యర్థి లాస్యనందిత